# 41

# మహత్వపూర్ణమైన రెండు ఘోషణలు

## (16:13-20)

యేసు క్రీస్తు దేవుని కుమారుడై యున్నాడని పేతురు పలికిన ఒప్పుకోలు మత్తయి వ్రాసిన సువార్తలో ఒక ముఖ్యమైన మైలురాయియై యున్నది. యేసు దైవికమైన మెస్సీయాయై, దావీదు కుమారుడై యున్నాడను గుర్తింపుతో ఈ సువార్త ఆరంభమగుచున్నది (1:1, 16, 17, 20, 23). యేసు బాప్తిస్మము పొందిన పిమ్మట, ఆయన తన ప్రియమైన కుమారుడై యున్నాడని దేవుడు యేసు క్రీస్తును అంగీకరించాడు (3:17). బాప్తిస్మమిచ్చు యోహాను క్రీస్తునకు మార్గమును సరాళము చేసాడు (3:11, 12), కానీ, అటుతరువాత యేసు నిజముగా క్రీస్తైయున్నాడని రూఢిపర్చుకొనగోరాడు (11:2–6). యేసు చెప్పుచుండిన బోధలకు, ఆయన చేయుచుండిన అద్భుతకార్యములకు జనసమూహములు తరుచుగా విస్మయమొందుచుండిరి (4:24, 25; 7:28, 29; 9:31, 33; 13:54; 15:31). అయితే కొందరు–ముఖ్యముగా తన సొంత స్థలమైన నజరేతు పట్టణములోని ప్రజలే (13:57) మరియు యూదా మత నాయకులు (9:3; 12:24) ఆయనను తృణీకరించారు. ఇతరులు ఆయనను దావీదు కుమారునిగా దండోరాలతో చాటింపుచేసారు (9:27; 12:23; 15:22). యేసు పెనుతుఫానును నిమ్మళింపజేసిన తరువాత శిష్యులు సహితము యేసు గుర్తింపు గూర్చి ప్రశ్నించారు: "ఈయన ఎట్టివాడో, ఈయనకు గాలియు సముద్రమును లోబడుచున్నవి?" (8:27). ఆయన నీళ్ల మీద నడచి వారి యొద్దకు వచ్చిన తరువాత ఉత్తేజవంతులైన శిష్యులు, "నీవు నిజముగా దేవుని కుమారుడవు!" పలికారు (14:33). ఈ ఘోషణ పేతురు యొక్క సరైన ఒప్పుకోలుకు, ప్రశాంతమైన పరిస్థితులలో సంభవించిన సంభవమునకు ముందుఛాయగా ప్రయోజనపడుచున్నది.

### పేతురు: నీవు ... క్రీస్తువు (16:13–16)

**13యేసు ఫిలిప్పుదైన కైసరయ ప్రాంతములకు వచ్చి–మనుష్యకుమారుడెవడని జనులు చెప్పుకొనుచున్నారని తన శిష్యులను అడుగగా 14వారు–కొందరు బాప్తిస్మమిచ్చు యోహాననియు, కొందరు ఏలీయా అనియు, కొందరు యిర్మీయా అనియు లేక ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొనుచున్నారనిరి. 15అందుకాయన–మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారని వారి నడిగెను. 16అందుకు సీమోను పేతురు–నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను.**

**వచనము 13.** దోనెను గలిలయ సముద్రమునకు తూర్పు దిక్కునున్న (16:5) బేత్సయిదా తీరమున నిలిపిన తరువాత (మార్కు 8:22), **యేసు** మరియు ఆయన శిష్యులు దాదాపుగా ఇరవై మైళ్ల దూరం ఉత్తరమున నున్న **ఫిలిప్పుదైన కైసరయ ప్రాంతముల వరకు**

పయనించారు. "ప్రాంతము"నకు బదులుగా, మార్కు 8:27లో "గ్రామములకు" అని గ్రంథస్థంచేయబడి యున్నది. ఈ ప్రదేశము, ఇచ్చటి నీటి ఊటలు యొర్దాను నదికి ఒక వనరుగా పనికివచ్చినవి,[1] హెర్మోను పర్వతమునకు దిగువ భాగంలో ఉండినది. ఇది పాత నిబంధనలోని పట్టణము, ఇశ్రాయేలు దేశమునకు ఉత్తర పొలిమేరలో నుండిన దానునకు సమీపమున నుండినది. ఉత్తర దిశకు సంబంధించిన ఈ స్థలము "దాను మొదలుకొని బెయేర్షబా వరకు" అను లోకప్రసిద్ధమైన లోకోక్తిలో[2] ప్రతిబింబించబడినది, ఇది ఇశ్రాయేలు దేశమంతటిని సూచించినది.[3]

ఈ పాతనిబంధన స్థలము బయలు దేవతారాధనకు ప్రసిద్ధిగాంచిన పట్టణమై యుండినది (యెహోషువ 11:17; న్యాయాధిపతులు 3:3; 1 దినవృత్తాంతములు 5:23). హెల్లేనీయుల పరిపాలనా కాలంలో, ఈ పట్టణము పేరు "పనియస్" (Paneas or Panias) గ్రీకు దేవత పాన్ (Pan)కు గౌరవ సూచకంగా పర్వత రాళ్లలో చిన్న చిన్న గుడులు తొలిచియుండబడినవి, ఈ దేవత, సమీపములోని ఒక గుహలో జన్మించినదని ఒక పౌరాణిక కథ చెప్పుచున్నది. పాన్, సగ భాగము మేక వలెను, సగ భాగము మానవుని వలెను యుండినట్లు చిత్రీకరింపబడెను. ఈ దేవత గొర్రెల కాపరులు, మందలు, పొలములు, తోటలు, మరియు అరణ్యములకు దేవతయైయుండి, ప్రజ్ఞశక్తి మరియు వసంత రుతువుతో సంబంధము గలదై యుండెను.

"కైసరయ" అను పేరు కైసరు ఔగుస్తునుబట్టి చతుర్థాధిపతియైన ఫిలిప్పు[4] చేత పెట్టబడి, అటుతరువాత తనను తాను గౌరవించుకొనుటకును, మరొక కైసరయ అనగా, మధ్యధరా సముద్ర తీరమున వైభవోపేతమైన నౌకాశ్రయముగా నుండిన పట్టణము (అపొస్తలుల కార్యములు 8:40; 12:19; 23:33)[5] నుండి భిన్నముగా గుర్తింపబడునట్లును ఆ పేరుకు "ఫిలిప్పి" అని చేర్చాడు. ఫిలిప్పుదైన కైసరు ఔగుస్తుకు[6] గౌరవసూచకంగా మహా హేరోదు చేత నిర్మింపబడిన గుడి ఉండినది. ఈ పట్టణము ప్రబలముగా అన్యజనులతో నిండినదై యుండగా, అచ్చటనే యూదులకు సంబంధించిన ఒక చిన్న ప్రజాగుంపు కూడ నివసించుచుండినది.[7]

పరలోక రాజ్యము రానైయున్నదని ప్రకటన చేయుటకు యేసు ఈ స్థలమును ఎంపికచేసుకొనుట అది ఎంత వక్రోక్తిగా నున్నదికదా! ఆ రోజుల్లో సకల దేశ పరిపాలకులలో అత్యంత బలవంతుడైన పరిపాలకుని కొరకు ప్రతిష్టింపబడిన స్థలంలో, యేసు తన సొంత రాజ్యము గూర్చి ప్రకటన చేసాడు. యేసు రాజ్యము వచ్చుట ద్వారా దానియేలు 2:44, 45లోని ప్రవచనము నెరవేరును.

వారు చుట్టూర ఉండిన ప్రదేశములనుండి ఫిలిప్పుదైన కైసరయ పట్టణములోనికి ప్రవేశించుచుండగా యేసు, **మనుష్యకుమారుడెవడని జనులు చెప్పుకొనుచున్నారు?** అని ఆయనను వెంబడించుచుండినవారిని ప్రశ్నించాడు. "మనుష్య కుమారుడు" అను వ్యక్తీకరణము దానియేలు గ్రంథంలోని (దానియేలు 7:13) ఒక ప్రవచనములో మెస్సీయా గూర్చి ప్రస్తావనకు వచ్చిన సందర్భములో ప్రయోగింపబడినది. దేవుడైన యెహోవా ప్రవక్తయైన యెహెజ్కేలుకు సెలవిచ్చిన మాటల్లోని "నరపుత్రుడా" అను పదము మామూలుగా "మానవుడు," అనగా, ఈ లోకములోనికి జన్మించినవాడు, అను అర్థము నిచ్చుచున్నది. యేసు తనను గూర్చి ప్రస్తావించినప్పుడెల్లా, తన మానవత్వమును నొక్కి వక్కాణించుచు, ఈ

హోదాను సూచించు బిరుదునే అతి తరుచుగా ఉపయోగించాడు (8:20పై గల వ్యాఖ్యానము చూడు). అయన ఎవరై యున్నారో, ఆయన గుర్తింపేమిటో అని ప్రబలముగా ప్రబలియుండిన ఊహాగానాలనుబట్టి యేసు నిస్సంశయముగా ఈ ప్రశ్న అడుగాల్సివచ్చింది.

**వచనము 14**. ఆరంభములో, ఆయన **బాప్తిస్మమిచ్చు యోహానై** యున్నాడని కొందరనుకొనుచున్నారని ఆయన శిష్యులు ప్రత్యుత్తరమిచ్చారు. వారిలో, ఇదివరకే చెప్పుకొనబడినట్లు, హేరోదు అంతిపయ ఒకడు. యేసు మృతులలో నుండి తిరిగి లేచిన బాప్తిస్మమిచ్చు యోహాను యున్నాడని ఈయన నమ్మియుండెను. ఈ దృష్టికోణము యేసు కలిగియుండిన అద్భుతకరమైన శక్తికి హేతువయ్యింది (14:2పై గల వ్యాఖ్యానము చూడు).

ఆయన **ఏలీయాయై** యుండెనని **ఇతరులు** అనుకొన్నారు. ఇతరులు ఇలా అనుకొనుటకు బహుశా యేసు మరియు బాప్తిస్మమిచ్చు యోహాను యొక్క జీవితవిధానములు ఒకే రీతియైనవిగాను, వారి సందేశములు కొంత మేరకు పోలికలుగలవై యుండుట కారణమై యుండును. ఇంకా, ఏలీయా వచ్చునని ప్రవక్తయైన మలాకీ ముందుగానే ప్రవచించాడు (మలాకీ 4:5). ఏలీయా, బాప్తిస్మమిచ్చు యోహాను రూపంలో వచ్చియున్నాడని చెప్పుచు యేసు ఈ ప్రవచనమును వివరించాడు (మత్తయి 11:14పై గల వ్యాఖ్యానము చూడు).

యేసు, **యిర్మీయాయై** యుండెనని **యింకా కొందరు** భావించారు. యేసు మరియు యిర్మీయా, దేవుని ప్రజల ఆధ్యాత్మిక శ్రేయస్సు గూర్చి కలిగియుండిన ఆందోళనకరమైన చింత, యేసు మరియు పాత నిబంధన ప్రవక్తయైన యిర్మీయా మధ్య నుండి అత్యంత గమనార్హమైన ఒక పోలికయై యుండును. యిర్మీయా, "విలపించుచున్న ప్రవక్త" యని ప్రసిద్ధిగాంచాడు. ఆయన తన ప్రజల పాపముల గూర్చి దుఃఖించుచున్నవాడై, వారు మారుమనస్సు నొందకుండుటనుబట్టి ప్రలాపించుచు విలాపవాక్యములు గల గ్రంథం రచించాడు. యేసు బహిరంగముగా ఏడ్చాడు, ఆయన "వ్యసనాక్రాంతుడును వ్యాధిననుభవించినవాడును" అయియుండెను (యెషయా 53:3). ఆయన యెరూషలేము నాశనము గూర్చి ముందుగానే తెలియజెప్పాడు (మత్తయి 24:1–28) మరియు ఆ పట్టణ వాసులు మారుమనస్సు నొందనందువలన వారి గూర్చి ఏడ్చాడు (లూకా 19:41). ప్రవక్తయైన యిర్మీయా మరియు యేసు, ఈ ఇద్దరు యూదుల నాయకుల చేతిలో శ్రమలనుభవించారు.

ఈ సంగతులు ఆ కాలమందలి యేసు పరిచర్యలో యింకను సంభవించియుండలేదు గనుక, ప్రజలు ఆయనను ప్రవక్తయైన యిర్మీయాతో ఎందుకు పోల్చుకొన్నారు? యిర్మీయా మరణము గూర్చి లేఖనములలో వ్రాయబడలేదు గనుక, ఆయన పరలోకమునకు ఆరోహణుడై మెస్సీయా యొక్క అమర సహచరులతో కలిసిపోయియుండునని బహుశా యూదులు నమ్మియుందురు.[8] ఇంకా, అసత్య నామములతో లేఖనములను పోలినవై యుండుటకు ప్రయత్నించు పుస్తకములలోని ఒక పుస్తకము యెషయాతోపాటు, దేవుని ప్రజలకు సహాయమును అందజేయుచు, యిర్మీయా గూర్చి పేర్కొనుచున్నది.[9] ఏదిఏమైనా, ఈ విషయము క్రైస్తవులు సిద్ధంచేసిన యూదుల గ్రంథ పాఠమునకు తరువాత చేర్చబడినదని కొందరు పండితులు నమ్ముదురు.

యేసునకు మరొక గుర్తింపు ఈయబడినది: **ప్రవక్తలలో ఒకడు**. సామాన్యమైన ఈ సమాధానము యేసును పాత నిబంధన ప్రవక్తలలోని ఏ ఒక్కరితోనైనను కలిపి ప్రస్తావించలేదు కాని వారందరితో ముడిపెట్టినది. "పూర్వకాలపు ప్రవక్త ఒకడు లేచెనని"

ప్రజలు విశ్వసించారు (లూకా 9:8, 19).

**వచనము 15**. ఇతరులు ఆయన గూర్చి ఏమనుకొనుచుండిరో యని తన శిష్యులనడిగి చర్చించిన పిదప, ఆయన తన దృష్టిని అపొస్తలులవైపు మళ్లించాడు: **మీరైతే నేను ఎవడని చెప్పుకొనుచున్నారు?** గ్రీకు భాషలో, "మీరు" అను సర్వనామము నొక్కిచెప్పబడినది. ఆయన గుర్తింపు గూర్చి ఇతరుల అభిప్రాయములు ఏమైయుండినవో అని యేసు తన శిష్యుల నడిగాడు, కానీ ఆయనను గూర్చి *వారి* విశ్వాసమేమై యున్నదో ప్రకటన చేయవలెనని ఆయన ఇప్పుడు తన అపొస్తలులనే అడుగుచున్నాడు. ఆయన వాస్తవముగా ఎవరై యున్నాడో అను సంగతి గూర్చి శిష్యులలో సహితము అనేక మరియు భిన్నమైన అభిప్రాయములుండవచ్చును, కానీ వారు సరైన తీర్మానము చేసుకొనుటకు ఇప్పుడు సమయము రానే వచ్చింది. ఆయన ఇహలోకములో దైవమానవుడుగా జీవించియుండు కాలము ముగింపునకు వచ్చుచుండినది, గనుక ఇక మీదట ఆయన కార్యములను, కార్యక్రమములను కొనసాగించుటకు విడిచిపెట్టుబడువారు వీరే. ఆయనయందలి విశ్వాసము అత్యావశ్యకమై యుండినది, లేదంటే వారి బృహత్కార్యము సఫలీకృతము కాదు.

**వచనము 16. అందుకు సీమోను పేతురు, నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను.** పేతురు తరుచుగా శిష్యులందరి ప్రతినిధిగా ప్రవర్తించాడు (14:28; 15:15; 16:16; 17:24–27; 18:21). ఈ సందర్భములోని పేతురు ఒప్పుకోలులో రెండు భాగములున్నవి. మొట్టమొదట, పేతురు యేసును "క్రీస్తు" అని గుర్తించుచున్నాడు. రెండవదిగా, "సజీవుడగు దేవుని కుమారుడవు" అని సంబోధించుచున్నాడు.[10]

యేసు "క్రీస్తు" అయియున్నాడని పేతురు చెప్పుచున్నాడంటే అతడు ఆయనను వారు ఎంతో కాలంగా ఎదురుచూచుండిన మెస్సీయగా గుర్తించుచున్నాడని అర్థము. "క్రీస్తు" (*Christos*) అను పదము, "మెస్సీయ" అని అనువదింపబడిన హెబ్రీ పదమునకు "Messiah" (*Maschiach*) గ్రీకు బాషలో సమానార్థము నిచ్చు పదమైయున్నది. ఆయన "అభిషిక్తుడు"గా నుండునట్లు దేవుడు ఏర్పరచుకొనినవాడు ఆయనే అయియున్నాడని ఈ పదము సూచించుచున్నది.

ఈ భాష, అధికారములో నుండినవారు–ఒక ప్రవక్త లేదా పెద్దలైనవారి ఒక గుంపు వంటి వారు–ఒలీవ నూనెతో భవిష్యత్ రాజును అభిషేకించుచుండిన ఆచరణ లో నుండి ఉత్పన్నమయ్యింది (1 సమూయేలు 16:13; 2 సమూయేలు 2:4; 5:1–3). ఇశ్రాయేలీయుల నెలుచుండిన రాజు, దేవుని చేత అభిషేకింపబడినవాడుగా, ఇహమందు దేవుని ప్రతినిధి యని పరిగణింపబడినాడు (కీర్తనలు 2:2, 6). యేసు కాలము నాటి ప్రజలు, దావీదునకియ్యబడిన వాగ్దానములపై (2 సమూయేలు 7:16) వారి దృక్పథమును ఆధారం చేసికొని, మెస్సీయ శాశ్వతమైన ఒక సింహాసనముగలవాడై యుండునని ఎదురుచూసారు.[11] అంద్రెయ, సీమోను పేతురు సహోదరుడు, వారి తొలి కూటమిలో యేసే మెస్సీయాయై యున్నాడని ఎంతో ఆతురతతో ప్రకటించాడు (యోహాను 1:41). "ఇశ్రాయేలు రాజువు" అంటూ నతనయేలు యేసును సంబోధించాడు (యోహాను 1:49), యేసే మెస్సీయాయై యున్నాడని చెప్పుటకు ఇది మరొక తీరైయుండినది.

"సజీవుడగు దేవుని కుమారుడు" అనునది కూడ మెస్సీయ సంబంధిత ఒక బిరుదై యుండినది, కానీ దానిలో యింకా లోతైన అర్థముండినది (2 సమూయేలు 7:14;

కీర్తనలు 2:7; 89:26, 27; హెబ్రీయులకు 1:5–14). ఇదివరకు శిష్యులలో కొందరు యేసును దేవుని కుమారుడుగా అంగీకరించారు. నతనయేలు ఇటువంటి ప్రకటననే చేసాడు (యోహాను 1:49), యేసు గలిలయ సముద్రముపై చెలరేగిన తుఫానును నిమ్మళింపజేసిన పిమ్మట పన్నెండు మంది శిష్యులు కూడ ఇటువంటి ప్రకటననే చేసారు (14:33). యేసు జీవాహారము (యోహాను 6:68, 69) గూర్చి ఉపన్యసించిన తరువాత, ఆయన "దేవుని పరిశుద్ధుడని" పేతురు ఆయనయందుంచిన విశ్వాసమును ప్రకటించుచున్నాడు. ఆయన "దేవుని కుమారుడని" వారు చెప్పుచుండిన మాటల ద్వారా, వారు ఆయన శక్తిని మరియు దైవత్వమును గుర్తించుచుండిరి. యేసు, దేవునితో కలిగియుండిన అసమానమైన సంబంధము గూర్చి వారొక ప్రకటన చేయుచుండిరి. ఆయన తండ్రి "సజీవుడైన దేవుడై" యుండెను. ఇది ఆయనను జీవములేని అన్యమతారాధికుల విగ్రహములకు బొత్తిగా తారతమ్యములో నుంచిన దేవుని పాత నిబంధనలోని ఒక హోదాయై యుండెను (ద్వితీయోపదేశకాండము 5:26; యెహోషువ 3:10; కీర్తనలు 42:2; దానియేలు 6:20; హోషేయ 1:10). ఈ భాష ఫిలిప్పుదైన కైసరు ప్రాంతములో, అనగా బయలు దేవత, పాన్ దేవత, మరియు కైసరు ఔగుస్తు పూజింపబడుచుండిన ప్రదేశములో నిశ్చయముగా సముచితమైనదై యుండినది.

## నా సంఘమును కట్టుదును అని యేసు చెప్పెను (16:17, 18)

**17అందుకు యేసు–సీమోను బర్ యోనా, నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనేకాని నరులు నీకు బయలు పరచలేదు. 18మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోకద్వారములు దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను.**

**వచనము 17.** ఈ సత్యమును గూర్చి అతనికుండిన ఎరుక మరియు ఆ ఎరుక అతనికి ఏ మూలాధారము నుండి ఎరుకయ్యిందో దానినిబట్టి **యేసు** పేతురుతో "నీవు ధన్యుడవు" అని అతనిని **ఆశీర్వదించాడు.** "ధన్యుడు" అను మాట వాడు అత్యధికంగా ఆనందించుటకు హేతువుగల ఒకని వర్ణించుచున్నది (5:3–12; 11:6; 13:16; 24:46).

ఈ సత్యము అతనికి, మనుష్యుల చేత (**రక్తమాంసముల చేత**) కాదు కాని **పరలోకమందున్న తండ్రి చేత** బయలుపరచబడింది గనుక పేతురు "ధన్యుడు" గా ఆశీర్వదింపబడినాడు. జాన్ లైట్ ఫుట్గారు, లెక్కలేనన్నిసార్లు యూదుల గ్రంథ రచనలలో అగుపించుచు, మానవులకును దేవునికిని గల తారతమ్యమును చూపించుటకు ప్రయోగింపబడు "రక్తమాంసములు" అను పదజాలమువైపు మన సావధానమును మళ్లించుచున్నాడు.[12] క్రొత్త నిబంధనలో, మానవ బలహీనతలను కూడ నొక్కిచెప్పుచున్నది (1 కొరింథీయులకు 15:50; గలతీయులకు 1:16; ఎఫెసీయులకు 6:12; హెబ్రీయులకు 2:14, 15). NEB పాఠాంతరము ఈ పదజాలమును 17వ వచనములో "మర్త్యుడైన మానవుడు" అని అనువదించుచున్నది.

సత్యము తండ్రి చేత బయలుపర్చబడినదను వాస్తవము యేసు క్రీస్తు చెప్పిన ఉపదేశములు మరియు ఆయన చేసిన అద్భుతకార్యములను సూచింపవచ్చును (11:25, 26). ఆయన సందేశము మరియు బృహత్కార్యము దేవుని నుండి కలిగినవని యేసు

స్పష్టంచేసాడు (యోహాను 4:34; 5:30; 6:38, 39; 7:16). కాబట్టి, పేతురు యేసు చేయుచుండిన పరిచర్యను గమనించుచుండినందు వలన అతడు, యేసే క్రీస్తైయున్నాడనియు, ఆయన దేవుని కుమారుడై యున్నాడనియు నమ్మునట్లు అట్టి గమనిక దోహదపడినది (14:33; యోహాను 6:69). ఈ సత్యమును పరిశుద్ధాత్మయే ప్రత్యక్షంగా పేతురుకు అప్పజేసియుండుట మరొక సాధ్యతయై యున్నది. ఎంతైనా, అది ప్రేరేపణా యుగమై యుండినది (2 పేతురు 1:20, 21). యేసు ఎవరో దేవుడు ఈ నాటి ప్రజలకు యింకను బయలుపర్చుచునే యున్నాడు, కాని ఆయన ఈ పని ప్రేరేపింపబడిన తన వాక్యము ద్వారా చేయుచున్నాడు (రోమీయులకు 10:13–17).

యేసు, పేతురును **సీమోను బర్ యోనా** అని సంబోధించుచున్నాడు. "బర్" అను మాట హెబ్రీ మాట "బెన్" ("బిన్")నకు సమానార్థమిచ్చు అరమెయిక్ మాటయై యున్నది; ఈ రెండింటి అర్థము, "... యొక్క కుమారుడు." పేతురు, "జోనా" అను పేరుండినవాని కుమారుడు. యేసు పేతురును తొలి పర్యాయము కలిసికొన్నప్పుడు కూడ ఇదే పదమును ప్రయోగించాడు (యోహాను 1:42). యేసు పునరత్థానుడైన తరువాత గలిలయ సముద్ర తీరమున వారు కలిసికొన్నప్పుడు ఇదే పదమును ముమ్మారు ప్రయోగించాడు (యోహాను 21:15–17).

**వచనము 18. మరియు నీవు పేతురువు; ఈ బండ మీద నా సంఘమును కట్టుదునని** యేసు పేతురుతో చెప్పాడు. ఈ ఇరువురు తొలిసారి కలిసికొన్నప్పుడు (యోహాను 1:42), యేసు అతనికి "రాయి" అను అర్థమిచ్చు "కేఫా" అను అరమెయిక్ పేరు పెట్టాడు (యోబు 30:6; యిర్మీయా 4:29 చూడు). ఈ పేరుకు సమానార్థమిచ్చు గ్రీకు పదము "పేతురు" (*Petros*), ఈ పదము పుంలింగమునకు సంబంధించినదై, "రాయి" అను అర్థమునిచ్చుచున్నది.[13] "ఈ బండ మీద నా సంఘమును కట్టుదును" అని యేసు చెప్పినప్పుడు, ఆయన సీమోనుకు పెట్టిన నామ ప్రయోగ సందర్భములో ఆయన కొంత పదచమత్కారమును ప్రదర్శించుచుండవచ్చును. యేసు చేసిన ప్రకటనలోని "బండ" (*petra*) అను అర్థమిచ్చు గ్రీకు పదము స్త్రీలింగమునకు సంబంధించినదై యుండి, "అట్టడగున నుండు శిలాసంస్తరమును లేదా అట్టడుగున అత్యధిక ప్రమాణంలో ఉన్న బండరాళ్లను" సూచించుచున్నది.[14] బహుశా ఫిలిప్పుదైన కైసరయ చుట్టూర నిటారుగా నుండిన ఎత్తైన కొండ శిఖరములు ఆయనలో ఇటువంటి మనఃకల్పనను కలిగించియుండవచ్చును.

యేసు అన్యజనులతో గ్రీకు భాషలో సంభాషించియుండినప్పటికిని (15:21–28), ఈ సందర్భములో ఆయన తన శిష్యులతో మాటలాడుచుండినప్పుడు అరమెయిక్ భాషను ప్రయోగించియుండును. గనుక, ఆయన "పేతురు" మరియు "రాయి" అను అర్థమిచ్చు పదమును వాడినప్పుడు అదే అరమెయిక్ పదమును *keypap'* ఉపయోగించియుండును. అలాగైతే, యేసు ప్రకటనను గ్రీకు భాషలోనికి అనువదించుచు, సహజంగానే మత్తయి అరమెయిక్ పదమునకు అర్థముచెప్పుటకు స్త్రీలింగ సంబంధమైన నామవాచక పదమును *petra* ఉపయోగించియుండును, ఏలయనగా *petra* ఇందుకు అత్యంత సమీపముగా నున్న సమానార్థమిచ్చు పదమై యున్నది. ఏదిఏమైనా, *Petros* అను పులింగ సంబంధ పదమును ఉపయోగించుటయే సముచితమై యుండినది ఏలయనగా పేతురు పురుషుడై యుండెను. *Petros* మరియు *petra* అను నామవాచకములు కొన్ని పర్యాయములు

ఆదాన ప్రదానములుగా వాడబడినప్పటికని,[15] ఇటువంటి సందర్భములో ఇది ఎన్నటికిని జరిగియుండదు. యేసు ఎంపిక చేసుకొని ప్రయోగించిన పదములు "పేతురు"నకును, "రాయి"కిని మధ్య గల తేడాను గుర్తించినవి.

యేసు చేసిన ప్రకటన భావము తరుచుగా చర్చింపబడుచున్న అంశమై యున్నది. "రాయి" అను పదము పేతురునే సూచించుచున్నదని వాదింపబడుచున్నది. అనగా, యేసు తన సంఘమును పేతురుపై కట్టునని మరొక మాటలో చెప్పుకొనవచ్చును. ఈ దృష్టికోణము, ఆయనే ప్రాథమిక అపొస్తలుడై యుండెనని చెప్పుకొనుచు, ఆదిమ క్రైస్తవ్యము వ్యాపించుటలో ఈ అపొస్తలుడు వహించిన ప్రధాన పాత్రకు సందర్భశుద్ధిగలదిగా నున్నది. క్రైస్తవ్యములో పేతురు ప్రాముఖ్యమైన పాత్ర వహించిన మాట వాస్తవమే, కానీ అది ప్రాథమిక పాత్ర కాదు. అపొస్తలుల ప్రతి జాబితాలోను ఆయన నాయకత్వం వహించుచుండిన స్థానములో నుండెనను వాస్తవములో పేతురు యొక్క ప్రాముఖ్యత గమనింపబడుచున్నది (10:2-4; మార్కు 3:16-19; లూకా 6:14-16; అపొస్తలుల కార్యములు 1:13). యేసు ఆరోహణుడైన పిదప, పేతురు ఈ క్రింది సంఘటనలలో నాయకత్వము వహించాడు: అపొస్తలులలో యూదా స్థానంలో మరొకరిని ఎన్నికచేసుకొనుట (అపొస్తలుల కార్యములు 1:15-22), పెంతెకొస్తు దినాన యెరూషలేములో సంఘమును స్థాపించుట (అపొస్తలుల కార్యములు 2:14-40), అద్భుతములు చేయగలుగుటకు పరిశుద్ధాత్మ అనుగ్రహించు వరమును సమరయుల పరముచేయుట (అపొస్తలుల కార్యములు 8:14-25), అన్యజనుల మధ్య సువార్త విస్తరించుట (అపొస్తలుల కార్యములు 10; 11), మరియు యూదులకను అన్యజనులకును మధ్య తలెత్తిన వాదోపవాదములను సరిచేయుట (అపొస్తలుల కార్యములు 15:7-11).

ఈ దృష్టికోణము, పేతురు మొట్టమొదటి బిషప్ అయియుండెననియు, అతని పదవి నిరంతరముండుననియు ("అపొస్తలత్వ వారసత్వము"నకు సంబంధించిన సిద్ధాంతము) వారు చేయుచుండు సాంప్రదాయబద్ధమైన కథోలిక్కుల అసత్య భోధలను అంగీకరించకుండానే కొనసాగింపబడవచ్చునని వాదింపబడుచున్నది. ఉదాహరణ దేవుని చరిత్రలోని ఈ సందర్భంలో పేతురు వహించిన పాత్ర అసమానమైనదై యుండినదని డేవిడ్ హిల్ గమనించాడు. ఈయన ఉజ్జాయింపు ప్రకారం, ఈనాడు రోమా పట్టణములో నుండు బిషప్పులు ఇటువంటి పాత్రనే వహించవలసియున్నదను అభిప్రాయము కాదు.[16] ఇంకా, డొనాల్డ్ ఏ హేగ్నర్ ఇలా వాదించుచున్నాడు,

> అయితే ఈ వాక్యభాగమునకు దాని సహజార్థమును అన్వయించుట, అనగా పేతురు, సంఘము దానిపై నిర్మింపబడుచున్న బండయైయున్నాడని అనుమతించుట, ఎట్టి పరిస్థితులలోను పోప్ ఆధిపత్యము రూఢిపరచబడుచున్నదని కాదు లేదా సంఘము, దాని ఉనికి నిమిత్తము, అపొస్తులుల వలె పునాదియైన క్రీస్తుపై ఆధారపడుటలేదని కూడ చెప్పుట కాదు. ఎంతైనా, నిర్మాణకుడు యేసే, మరియు అపొస్తలులు చేయు సమస్తము ఆయన ద్వారానే చేయుదురు … తరుచుగా సూచింపబడినట్లు, ఇచ్చట బండయైయున్నాడని అందరి దృష్టిలో ఉన్నది క్రీస్తని ఒప్పుకొనినది పేతురే, గనుక క్రీస్తు యొక్క ప్రతినిధిగా తరువాత వచనములో పేర్కొనబడిన అధికారము, అతని చేతులకు అప్పగింపబడిన క్రీస్తు సువార్తను బట్టి అతనికియ్యబడినది.[17]

బండగా పరిగణింపబడిన ఈ స్థానము తరుచుగా "క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయియై యుండక అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాది మీద" (మీరు) సంఘము కట్టబడయున్నదని[18] పౌలు వ్రాసిన ఎఫెసీయులకు 2:20లోని మాటలతో ముడిపెట్టబడినది (ప్రకటన 21:14 చూడు).

"బండ" అను మాట, "నీవు సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తు" అని పేతురు యేసును గూర్చి పలికిన ఒప్పుకోలును (మత్తయి 16:16) సూచించుచున్నదనునది ఆ వచనము వ్రాయబడిన తీర్పును గూర్చి గల మరొక దృక్పథమైయున్నది. మెస్సీయ, దేవుని నూతన గృహము నిర్మింపబడు పునాదియైన బండయైయుండునని పాత నిబంధన ప్రవచన రీతిగా పలుకుచున్నది (కీర్తనలు 118:22; యెషయా 28:16; దానియేలు 2:44, 45). యేసు, సంఘము నిర్మింపబడు పునాదియైన బండయైయున్నాడని నూతన నిబంధన రూఢిపరుచుచున్నది (21:42; అపొస్తలుల కార్యముల 4:10–12; 1 కొరింథీయులకు 3:11; 1 పేతురు 2:4–8). ఈ సందర్భములో, అట్టడుగున నున్న గట్టి ఆధార శిలయైన సత్యము అనగా, యేసు క్రీస్తు దేవుని కుమారుడై యున్నాడని పేతురు ఒప్పుకొన్న సత్యము, పునాదియైయున్నది. క్రీస్తునందు విశ్వాసముంచువాడు వాని బాప్తిస్మమునకు ముందుగా (అపొస్తలుల కార్యములు 8:37), వాడు క్రీస్తుతో ఏకమై సంఘములోనికి చేర్చబడినప్పుడు ఈ సత్యమును ఒప్పుకొనును (అపొస్తలుల కార్యములు 2:41; రోమా 6:3–5; 1 కొరింథీయులకు 12:13; గలతీయులకు 3:26, 27). ఈ విధంగా, సరైన ఒప్పుకోలు సంఘము నిర్మింపబడు పునాదిలో సజీవమైనది మరియు చురుకైన భాగమౌతోంది.

రాజ్యమును (సంఘమును) బండ మీద కట్టబడిన ఒక పట్టణముతో పోల్చుచు, జే. డబ్లు. మెక్‌గార్వే ఈ నిర్దిష్ట స్థానమును నిర్ణయించారు. సంఘ నిర్మాణకుడు క్రీస్తైయున్నాడు (మత్తయి 16:18) మరియు దాని తాళపుచెవులుగల ద్వారపాలకుడు పేతురై యున్నాడు (మత్తయి 16:19) గనుక, బండ దేనికైనా ఒక దానికి ప్రతినిధియై యుండవలెను. సరైన ఒప్పుకోలు దాని పునాదియైయున్నది తక్షణ సందర్భము సూచించుచున్నది (మత్తయి 16:16, 17). మెక్‌గార్వే ఇలా వ్రాయుచున్నాడు,

> ఈ సత్యము, అనగా యేసే క్రీస్తై యున్నాడు, ఆయన సజీవుడగు దేవుని కుమారుడై యున్నాడను సత్యము, క్రైస్తవ వ్యవస్థలో అత్యంత మూలాధారమైన సత్యమైయున్నది–దాని మీద కట్టబడునదంతయు ఆధారపడునది, అదే; కాబట్టిరక్షకుడను బండ చేత అది అత్యంత సముచితముగా ప్రాతినిధ్యము వహించబడుచున్నది.[19]

మెక్‌గార్వేగారు మనముందుంచుచున్న ఈ దృష్టికోణమును ప్రశంసించుటకు దానిలో ఎంతో గొప్ప భావము దాగియున్నది. సందర్భము, పదచమత్కారములు, మరియు క్రొత్త నిబంధన యొక్క తదుపరి ఉపదేశములు త్రోసిపుచ్చబడజాలని ఒక వ్యాఖ్యానమును సిద్ధంచేయుచున్నవి.

ఆయన తన నిర్మాణ ప్రణాళిక ఏమైయుండినదో వర్ణించినప్పుడు యేసు, "నా" అను సంబంధార్థకమైన సర్వనామమును ప్రయోగించాడు. "సంఘము" (*ekklēsia*) అని ప్రయోగించిన పదము క్రొత్త నిబంధనలో అగుపించుట, ఇదే తొలి సారి. ఈ పదమును ప్రయోగించినది మత్తయి సువార్తీకుడు ఒక్కడే (16:18; 18:17). "సమావేశము" మరియు "సభ" అని కూడ అనువదింపబడిన పదము *ekklēsia,*[20] క్రొత్త నిబంధనలో

114 సార్లు వాడబడినది. అది సార్వత్రిక సంఘము (ఎఫెసీయులకు 1:22; 5:23), ప్రాంతీయ సమావేశములను (1 కొరింథీయులకు 16:1), ఒక స్థానిక సమావేశమును (1 కొరింథీయులకు 1:2), మరియు కూడుకొనియున్న సంఘమును (1 కొరింథీయులకు 11:18; 14:28) సూచింపవచ్చును. యేసు మత్తయి 16:18లో *ekklēsia* అను పదమును వాడినప్పుడు, ఆయన సార్వత్రిక సంఘము గూర్చి ప్రస్తావించుచుండెను. సంఘము క్రీస్తు సొంతము; ఆయన సంఘమును తాను సిలువపై చిందించిన అమూల్యమైన తన రక్తము చేత కొన్నాడు (అపొస్తలుల కార్యములు 20:28; 1 పేతురు 1:18, 19; 1 కొరింథీయులకు 6:20 చూడు). రాబం హెచ్. గుండ్రి ఆలోచన ఈ విధముగా నున్నది, మత్తయి వ్రాసిన సువార్తలో, "నా సంఘము" అను పదజాలము "వారి [లేదా, 'మీ యొక్క'] సమాజమందిరమున (ల)కు" (4:23; 9:35; 10:17; 12:9; 13:54; 23:34) తారతమ్యముగా నిలుచుచున్నది.[21]

ఇంకా, **పాతాళలోక** (Hades) **ద్వారములు దాని యెదుట నిలువనేరవని** కూడ యేసు పేతురుతో చెప్పాడు. KJV ఆంగ్ల అనువాదములో, నరకము అని అర్థమిచ్చు "హెల్" అని అనువదించబడింది. ఇది Hades (*Haidēs*) యొక్క పెడదోవ పట్టించు అనువాదమై యున్నది. క్రొత్త నిబంధనలో, "హేడ్స్" అనగా మృతుల ప్రపంచము, సామాన్యముగా "నరకము" (*gehenna*) నుండి, అనగా అంత్య తీర్పు తీర్చు స్థలము నుండి విలక్షణముగా గుర్తింపబడి యున్నది. జాక్ పి. లూయిస్ దీనిని ఇలా వివరించుచున్నాడు, KJV అనువాదము కూర్చబడినప్పుడు, "హెల్" అను ఆంగ్ల పదము రెండు గ్రీకు పదములను అనువదించుటకు ఉపయోగింపబడినది. ఆ కాలములో, "హేడ్స్" అను పదము ఆంగ్ల భాషలో ప్రచలితముగుట అప్పుడే ఆరంభమయ్యింది. ఈ వచనములో, అత్యంత ఆధునిక అనువాదములను చూచినట్లయితే, "పాతాళలోక ద్వారములు" అనియు లేదా దీనికి సమానార్థమిచ్చు పదములుగాని ప్రయోగింపబడియున్నవి.[22]

ప్రాచీన ప్రపంచంలో, ఒక పట్టణము యొక్క ప్రతిరక్షణ కొరకు ద్వారములు అత్యావశ్యకమైనవై యుంటూ, ఆ పట్టణము ఎంత బలమైనదైయున్నదో అవి సూచించినవి. "హేడ్స్" (*Haidēs*) అని అర్థమిచ్చుచున్న గ్రీకు పదమునకు, హెబ్రీ భాషలోని "శియోల్" (*Sh*$^{e}$*'ol*) అను పదము అదే అర్థము నిచ్చుచున్నది; ఈ రెండు పదములు కూడ మృతుల ప్రపంచమును సూచించుచున్నవి. యేసు మృతుల ప్రపంచము మరియు యొక్క శక్తి గూర్చి తెలియజెప్పుట, "ద్వారములు" మరియు "హేడ్స్" (పాతాళము) అను ఈ రెండు మనోగతములను జోడించాడు (RSV; TEV; NEB; REB చూడు). పాత నిబంధనలో "శియోలుల ద్వారములు" మరియు "మరణ ద్వారములు" అను పదజాలములు ప్రయోగించుట ద్వారా ఇది రూఢిపర్చబడినది (యోబు 17:16 [NIV]; 38:17; కీర్తనలు 9:13; 107:18; యెషయా 38:10). గ్రీకు సాహిత్యములో, "పాతాళ లోక ద్వారములు" మరియు "మరణ ద్వారములు" మరణము యొక్క పరిధి మరియు ఆధిపత్యమును కూడ సూచించును.[23] అపొక్రిఫ గ్రంథంలోని (అప్రమాణిక గ్రంథంలోని) ఒక పుస్తకము "మర్త్యులను పాతాళ ద్వారముల వరకును మరల వెనుకకును" ఆయన నడిపిస్తాడని తెలియజెప్పుచు, "జీవన్మరణములపై గల అధికారమును" దేవునికే ఆపాదించుచున్నది.[24]

పాతాళ లోక ద్వారములు (మరణము యొక్క శక్తి) "దాని యెదుట నిలువనేరవని"

యేసు సెలవిచ్చారు. ఈ మాటల్లో గల ఆయన భావమేమైయుండును? కనీసము రెండు సామాన్యమైన అర్థములు అనువదించుటకు సాధ్యత కలదు. ఒకటి, “దాని” అను సర్వనామము వాస్తవమైన సంఘ నిర్మాణమును సూచించుచున్నది. యేసు తన రాజ్యమును వ్యవస్థాపింపకుండునట్లు మరణము ఆయనను నిరోధించజాలదు. ప్రభువైన యేసు క్రీస్తు ముందుగానే తన మరణము మరియు పునరుత్థానము గూర్చి తెలియజెప్పుచుండగా, తక్షణ సందర్భములో ఈ అభిప్రాయము కనబడుచుచున్నది (16:21). పెంతెకొస్తు దినాన, “మరణము ఆయనను బంధించియుంచుట అసాధ్యము, గనుక దేవుడు మరణ వేదనలు తొలగించి ఆయనను లేపెను”; “క్రీస్తు పాతాళములో విడువబడలేదనియు, ఆయన శరీరము కుళ్లిపోలేదనియు” పేతురు బోధించాడు (అపొస్తలుల కార్యములు 2:24; 31). “క్రీస్తు, మృతులలోనుండి లేపబడినవాడై, ఇక ఎన్నటికిని మరణించడు; మరణము ఇక మీదట ఆయన మీద ప్రభుత్వము చేయదని” పౌలు రచించాడు (రోమీయులకు 6:8, 9; NRSV). ఏదిఏమైనా, యేసు నిర్మాణ ప్రక్రియ గూర్చి మాటలాడుచుండినట్లయితే, సర్వనామము అకర్మక రూపంలో ఉన్నదని మనము భావించుదుము.

“దాని” (*autēs*) అను సర్వనామము స్త్రీలింగములో నున్నది గనుక అది సంఘమునే సూచించుచున్నదనునది రెండవ అనువాదమైయున్నది. ఈ అనువాదమును మనస్సులో ఉంచుకొనుచు, మనము దేవుని రాజ్యము శాశ్వతమైనది గనుక అది ఎన్నటికిని ఓట మిపాలుకాదను ఒక తుది అభిప్రాయమునకు రావచ్చును (దానియేలు 2:44) యింకా నిర్దిష్టముగా చెప్పుకొనదలచినట్లయితే, దేవుని రాజ్యము హింసల మూలమున నిరోధింపబడజాలదని మనము చెప్పుకొనవచ్చును. ఈ ఇతివృత్తము ఈ అధ్యాయమంతటి సందర్భములో కూడ కనబడుచున్నది. హతసాక్షులు కావలసిన అవసరం వచ్చినను, వారు తమ్మునుతాము ఉపేక్షించుకొని ఆయనను వెంబడించవలెనని, ఆయనను వెంబడించుచుండిన వారిని యేసు మందలించాడు (16:24–27).

క్రీస్తును బంధించి యుంచుటకు మరణమునకు శక్తిలేదను విషయము వాస్తవమను మరొక ఆలోచనను కూడ పేర్కొనవచ్చును (1 కొరింథీయులకు 15:50–57). ప్రకటన గ్రంథంలో, “మరణము యొక్కయు పాతాళ లోకము యొక్కయు తాళపుచెవులు” ఆయన స్వాదీనములో కలిగి ఉన్నవాడని క్రీస్తు సోదాహరణంగా చిత్రీకరించబడియున్నాడు (ప్రకటన 1:18). తుట్టతుదకు, “మరణము మరియు పాతాళము” వాటి మృతులను అప్పగించును గనుక అగ్నిగుండములో పడవేయబడును (ప్రకటన 20:13, 14).

### యేసు: పరలోక రాజ్యము యొక్క తాళపుచెవులు నీకిచ్చెదను (16:19, 20)

**19పరలోక రాజ్యము యొక్క తాళపుచెవులు నీ కిచ్చెదను, నీవు భూలోకమందు దేని బంధిచుదువో అది పరలోకమందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో చెప్పెను. 20అటు పిమ్మట తాను క్రీస్తు అని యెవనితోను చెప్పవద్దని ఆయన తన శిష్యులకు ఖండితముగా ఆజ్ఞాపించెను.**

**వచనము 19.** యేసు తన సంఘమును (మత్తయి 16:18) కట్టునని వాగ్దానము చేసిన తరువాత **పరలోకరాజ్యపు తాళపుచెవులు నీ కిచ్చెదనని** ఆయన పేతురుకు వాగ్దానమిచ్చాడు.

యేసు, "సంఘము" మరియు "రాజ్యము" అను మాటలను పరస్పరము మార్పుచేయుచు ప్రయోగించిన పదములై యున్నట్లు అగుపించుచున్నది. తన అపొస్తలుల (మత్తయి 16:28) జీవితకాలములో రాజ్యము (సంఘము) వచ్చునని క్రీస్తు వాగ్దానము చేసాడు, మరియు అది ప్రస్తుతము తొలి శతాబ్దములోని రెండవ భాగములో వాస్తవముగా జరుగుచున్న విషయమని ఇతర వాక్యభాగములు దీనిగూర్చి ప్రస్తావించుచున్నవి (కొలొస్సయులకు 1:13; హెబ్రీయులకు 12:28; ప్రకటన 1:9).

తాళము వేయబడిన తలుపులకు తాళపుచెవులు ఉపయోగింపబడును; లోనికి ప్రవేశించుటకు అవే మార్గములైయున్నవి.[25] లేఖనములలో, "తాళపుచెవులు" అను మాట ఒకడు ఒక నిర్దిష్టమైన ప్రదేశముపై కలిగియున్న అధికారము మరియు దాని గూర్చి వానికి గల బాధ్యతను సంకేతించుటకు తరుచుగా అలంకారికముగా ప్రయోగింపబడినది (యెషయా 22:22; ప్రకటన 1:18; 3:7; 9:1; 20:1). పెంతెకొస్తు దినాన, యూదుల కొరకు పరలోక రాజ్యమును తెరుచుటకు పేతురు తాళపుచెవులను-సువార్తను ప్రకటించుట-ఉపయోగించాడు (అపొస్తలుల కార్యములు 2:14-42). అటు తరువాత కొంత కాలమునకు, పరలోక రాజ్యమును అన్యజనులుకు తెరుచుటకు పేతురు అవే తాళపుచెవులను ఉపయోగించాడు (అపొస్తలుల కార్యములు 10:34-48; 15:7).

ఏదిఏమైనా, ఈ తాళపుచెవులు పేతురు యొక్క వ్యక్తిగత ఆధిపత్యము కావు; ఇదే అధికారము ఇతర అపొస్తలుల సహితము ప్రధానము చేయబడినది (28:18-20; మార్కు 16:15, 16; లూకా 24:47; అపొస్తలుల కార్యములు 2:14). అంతమాత్రమే గాక, వారు సువార్త ప్రకటించుచుండగా విని ప్రభువును అంగీకరించినవారి కొరకు పరలోక తలుపులుతెరచిన ఇతర అపొస్తలుల చేత కూడ ఈ తాళపుచెవులు ఉపయోగింపబడినవి (అపొస్తలుల కార్యములు 8:4-13; 26-40; 16:14, 15, 25-34). ఇవే తాళపుచెవులు ఈనాడు కూడ ప్రపంచ నలుమూలల్లో ఇతరులతో క్రీస్తు సువార్తను పంచుకొనుచున్న విశ్వాసులైన క్రైస్తవుల చేత ఉపయోగింపబడుచున్నవి.

సువార్తను ప్రకటించుటకు "తాళపు చెవులుగా" ఇవ్వబడిన అధికారము యొక్క కూకటివ్రేళ్లు యూద మతములోనున్నవి. "తాళపుచెవులు అందజేయుట శాస్త్రీయమైనవాని అభిషేకములో భాగమైయుండినదని" గమనింపబడినది.[26] టాల్మూడ్ ప్రకారము, తాళపు చెవులు యూదా మత బోధకుని యొక్క బోధనా అధికారమునకు సంకేతమై యుండినవి.[27] "మనుష్యుల యెదుట పరలోక రాజ్యమును మూసివేసిన" (23:13) శాస్త్రులను మరియు పరిసయ్యులను యేసు గద్దించాడు. "జ్ఞానమను తాళపుచెవిని ఎత్తికొని పోయిరని" యేసు న్యాయాధిపతులను వ్యతిరేకించాడు (లూకా 11:52). వ్యక్తిగత విశ్వాసము కంటే నైతిక నియమమే ముఖ్యమైనదని చెప్పుచు వేషధారణను ప్రదర్శించుచుండుట ద్వారా, ప్రజలు లేఖనముల అసలు అర్థమును గ్రహించి యేసు గూర్చిన సత్యమును అంగీకరించకుండునట్టు ఈ మత నాయకులు వారికి కష్టము కలిగించుచుండిరి. ఈ విధంగా, పరలోక రాజ్యములో ప్రవేశించవలెనని ఆశించుచుండిన ప్రజలను వారు నిరుత్సాహపర్చుచుండిరి.

**నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువోఅది పరలోకమందును విప్పబడునని** పేతురుతో చెప్పుచు యేసు తన మాటలు కొనసాగించాడు. కొంతసేపైన తరువాత, ప్రభువు అపొస్తలులందిరితో

యిటువంటి వాగ్దానమే చేసాడు (18:18). రెండు వాక్యభాగములలో నున్న పరిపూర్ణమైన క్రియాపదములను ("బంధింపబడును," "విప్పబడును"), NASB అత్యంత విశదముగా అనువదించుచున్నది. వారు సంఘము విషయములో తమ సొంత నియమ నిబంధనలను ఆరంభింపవలెనని యేసు పేతురుకును ఇతర అపొస్తలులకును అధికారము యివ్వలేదు. దానికి బదులుగా, యేసు వారికి ఆజ్ఞాపించిన సమస్తమును-ఆయన మొదట్లో పరలోకమందున్న తండ్రినుండి పొందిన సత్యములను-బోధించుటకు వారి పరిశుద్ధాత్మ చేత ప్రేరేపింపబడుదురు (మత్తయి 28:20; యోహాను 14:15-17, 26; 15:26, 27; 16:12-15).

"బంధించుట" మరియు "విప్పుట" అను పదములు యేసు కాలములో సుపరిచితమైనవై యుండి, యూదులకు సంబంధిచిన నానావిధమైన సిద్ధాంతములలో తరచుగా అగుపించుచుండినవి. ఏయే విషయాలు పాటింపవలసిన అవసరమున్నదో, ఏయే విషయాలు పాటింపవలసిన అవసరంలేదో, ఏవి సమ్మతమైనవో, ఏవి అసమ్మతమైనవో ఈ పదములు స్పష్టం చేసినవి. యూదా మత బోధకులకు సంబంధించిన సాహిత్యములో నుండి ఉదాహరణల జాబితానొకటి లైట్‌పుట్ సంకలనము చేసాడు, మరియు వీటిలో అనేకములైన ప్రగతి కార్యక్రమములకు అధిక ప్రాధాన్యత నిచ్చు హిల్లేల్ వర్గమువారి నియమములతో పోటిపడి షమ్మాయ్ వర్గ విద్వాంసుల నియమములను నొక్కిపెట్టుచున్నవి. "షమ్మాయ్ పండిత వర్గము దానిని బంధించును, కానీ హల్లేల్ పండిత వర్గము దానిని విప్పునని" ఈ ఉల్లేఖనములలో అనేకము చెప్పును.[28]

పేతురు మరియు ఇతర అపొస్తలులు వాస్తవముగా దేనిని బంధించారు, దేనిని విప్పారు? అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయంతో మొదలై, వారు-యేసు వారికి ఇదివరకే బోధించినట్లు-పాపక్షమాపణ పొంది సంఘములో చేర్చబడునట్లు విశ్వాసము, మారుమనస్సు, మరియు బాప్తిస్మము కలిగియుండవలసి యుండినది (అపొస్తలుల కార్యములు 2:38-41). క్షమాపణా పదముల గూర్చి అపొస్తలులు బోధించు యోహాను 20:23లోని కష్టముగానున్న వాక్యభాగమును విశదీకరింపబడుచున్నది: "మీరు ఎవరి పాపములుక్షమింతురో, అవి వారికి క్షమింపబడును; ఎవరి పాపములు మీరు నిలిచియుండనిత్తురో, అవి నిలిచియుండును." రక్షణ నిమిత్తము యేసు కోరిన విషయమునే ప్రజలకు తెలియజెప్పుట ద్వారా వారు పాపములు క్షమించిన ఒకే భావమై యుండినది. కాలక్రమేపి, అపొస్తలులు సంఘము మరియు విశ్వాస సహితమైన క్రైస్తవ జీవితమునకు సంబంధించిన సమస్తమును బోధించారు. వారి అధికారమేమైయుండినదో ఆదిమ విశ్వాసులు అవగాహన చేసుకొన్నారు గనుక తమ్మునుతాము "అపొస్తలుల బోధకు" అంకితం చేసుకొన్నారు (అపొస్తలుల కార్యములు 2:42). ఈ బోధలు ఉల్లంఘించబడినప్పుడు ప్రేరేపింపబడిన అపొస్తలులు వారికియ్యబడిన అధికారమును సంఘ క్రమశిక్షణ విషయములలో వినియోగించుకొన్నారు. వారు పరిశుద్ధాత్మతోనే అబద్ధమాడినందువలన పేతురు, అననీయ సప్పీరాలను (అపొస్తలుల కార్యములు 5:1-11), అద్భుత కార్యాలు చేయు వరములు ప్రధానము చేయబడునట్లు పరిశుద్ధాత్మ శక్తిని కొనుగోలు చేయుటకు ప్రయత్నించినందుకు గారడీవాడైన సీమోనును (అపొస్తలుల కార్యములు 8:18-24) ప్రతిఘటించాడు.

**వచనము 20.** ఈ సంభాషణ తదుపరి, **తాను క్రీస్తు అని యెవనితోను చెప్పవద్దని**

యేసు ఆయనను వెంబడించుచుండినవారికి ఆజ్ఞాపించాడు. యేసు, క్రీస్తయియున్నాడనియు, దేవుని కుమారుడై యున్నాడనియు ఒప్పుకొన్నాడు (16:16)–ఇది నిస్సందేహముగా ఇతర అపొస్తలుల చేత పంచుకొనబడిన ఒప్పింపై యున్నది (మత్తయి 14:33). ఏదియేమైనా, పేతురు ఒప్పుకోలు భావము యొక్క సంపూర్ణ విస్తీర్ణత ఎంత గంభీరమైనదై యుండినదో, పేతురు మరియు మిగిలిన పన్నెండు మంది శిష్యులు పైపై గ్రహింపు మాత్రమే కలిగియుండిరి (మత్తయి 16:21). యేసు ఇహమందు ఇంకను జీవించియుండు సమయము కొంచెమే మిగిలియుండినది, కానీ ఆయన యొక్క అసలైన గుర్తింపు అనగా, వాస్తవమునకు ఆయన ఎవరైయుండెనో అను సత్యము, దేవుని చేత సంకల్పింపబడి యుండిన సమయమునకు ముందే సామాన్యముగా బయలుపరచబడి యుండినట్లయితే, దేవుని ప్రాణాళిక ప్రకారమైన ఆయన పరిచర్యకు ఎంతో హాని కలిగియుండేది. యుక్తకాలము వచ్చినప్పుడు, ఆయన ఎవరై యుండినది ధైర్యముతో బయలుపర్చుటకు యేసు వెనుకంజ వేయలేదు (26:63, 64; 27:11).

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### యేసు యొక్క ప్రతిరూపములు (16:13–20)

మత్తయి 16:13–20 సమస్త కోణాలో ప్రాముఖ్యమైనదై యుండిన యేసు ఎవరో అను ప్రశ్న గూర్చి తెలియజెప్పుచున్నది. ఒక వార్తపత్రికలోని సంపాదకీయము నాలుగు "యేసు ప్రతిరూపములు" గూర్చి తెలియజెప్పినది.[29] మనము ఏ ప్రతిరూపమునందు విశ్వసించుచున్నాము? ప్రపంచ ధనస్వామ్యములకు సంబంధించిన స్వేచ్ఛావిపణి మెస్సీయనా? సమాధానము మరియు న్యాయమునకు సంబంధించినవాడు, యథాపూర్వస్థితిలో నున్న వారిని గద్దెదించి సమాజమును హెచ్చించు వామపక్ష నజరేతువాడైన యేసునా? పెదవి కదపని (దేవుని) గొఱ్ఱెపిల్లయైనవాడు, క్రొత్త నిబంధన ఆయనకు ఆపాదించు దానిలో దాదాపుగా సమస్తమును అనుమానించుచునే దేవాలయములకు వెళ్లుచుండు సంశయవాదులైనవారి క్రీస్తైయియున్న యేసునా? ఈ దుష్ట లోకము గూర్చిన నిరాశావాదము దేవునికంటే సాతానుకే ఎక్కువ శక్తి ఉన్నదను ముద్రవేయుచున్న వారికి, అనగా ఎవని రెండవ రాకడయైతే సమస్తమును నిర్మూలనము చేయు ఒక నాటకమైయున్నదో వారు విశ్వసించు ఆయనను అనగా, ఈ లోకమును తిరిగి సందర్శించనైవున్న విమోచకుడినా?

తృణీకరింపబడిన నజరేతను గ్రామమునుండి వచ్చిన ఈ వడ్రంగి అసలు ఎవడైయుండెను? నజరేయుడైన యేసు నిజముగా దేవుని కుమారుడై యుండెనా లేక కేవలము మారువేషము వేసుకొని ఆయన తదుపరి వచ్చిన మరొకరివలె నటించుచుండిన అనేకులలో ఒకడైయుండెనా? ఆయన ఒక గొప్ప మనిషి, ఒక గొప్ప తత్వవేత్త, ఎప్పుడైనా గాని జీవించినవారిలో అతి గొప్ప బోధకుడు, మరియు నాయకుడు లేదా దేవుని కుమారుడు కాదు కానీ, బహుశా ఒక ప్రవక్తయై యుండెనని చెప్పుచు రాజీపడుటకు కొందరు ప్రయత్నించుదురు. కానీ యేసు విషయంలో తటస్థ సమ్మతముండనేరదు. ఏలయనగా యేసు ఆయన ఎమైయున్నాడని సాధికారంతో చెప్పాడో, అదే అయియున్నాడు, లేదా ఆయన ప్రపంచం ఎన్నడైనా ఎరిగిన అత్యంత మోసగాడును అబద్ధికుడునై యున్నాడు.

## యేసు గుర్తింపు (16:13-20)

యేసు ఎవరయ్యిందీ మనకెలా తెలుస్తుంది?

1. *ఆయన ఎవరైయున్నారో అని యేసు క్రీస్తు సాధికార పూర్వకంగా చెప్పిన విషయాల గూర్చి పరిశుద్ధ బైబిలులో గల సాక్ష్యము.* అతడు ఎవరి త్రోవనైతే సరాళముచేయ వచ్చాడో ఆయన ఈయనే అనియు, లోకపాపములు మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్లయై యున్నాడనియు, ఆయన దేవుని కుమారుడైయున్నాడనియు బాప్తిస్మమిచ్చు యోహాను సాక్షమిచ్చాడు (యోహాను 1:29-34; 5:33-35 చూడు).

యేసు ఆయన కుమారుడైయున్నాడని దేవుడు రెండు పర్యాయములు సాధికారంతో సెలవిచ్చాడు: యేసు బాప్తిస్మము పొందినప్పుడు (మత్తయి 3:16, 17), అదొక ప్రవచన నెరవేర్పైయుండినది (యెషయా 11:1, 2), మరియు యేసు రూపాంతరము పొందినప్పుడు (మత్తయి 17:5; లూకా 9:35) అతడు, అతనితోపాటు యాకోబు మరియు యోహాను "ఆ శబ్దము ఆకాశము నుండి రాగా మేము వింటిమని" చెప్పుచు, ఈ సంఘటన గూర్చి పేతురు అటు తరువాత రచించాడు (2 పేతురు 1:17, 18; యోహాను 5:37, 38 చూడు).

ఆయన తండ్రి చేత పంపబడినవాడై యున్నాడని ఆయన చేయుచుండిన అద్భుతకార్యములు రుజువు చేసాయని యేసు సెలనిచ్చాడు (యోహాను 5:36). అత్యంత బలవత్తరమైన సాక్ష్యము, పౌలు చెప్పుచున్నదాని ప్రకారము, యేసు పునరుత్థానుడై, మరియు యేసు దేవుని కుమారుడుగా ప్రభావముతో నిరూపింపబడెనని ఈ పునరుత్థానము ఘోషించినది (రోమీయులకు 1:2-7).

2. *ప్రవచనముల నెరవేర్పు మెస్సీయకు సంబంధించిన ప్రవచనములు లేఖనములలో ఎన్నో ఉన్నవి.* ఇవి మత్తయి వ్రాసిన సువార్తలో తరుచుగా గమనింపబడుచున్నట్లుగా, యేసు క్రీస్తులో నెరవేరాయి:

- యేసుకు ముందుగా వెళ్లువాడు వాగ్దానము చేయబడినాడు (యెషయా 40:3; మలాకీ 3:1; 4:5; మత్తయి 3:3).
- ఆయన కన్య గర్భమున జన్మించును (యెషయా 7:14; మలాకీ 1:18-25).
- ఆయన దాదాపుగా ఎప్పుడు జన్మించునో యని దాని సమీప సమయము తెలిజెప్పబడినది (దానియేలు 9:25; లూకా 2:1-7).
- ఆయన జన్మించనైయుండిన స్థలము పేరు కూడ ముందుగానే చెప్పబడినది (మీకా 5:2; మత్తయి 2:1-6).
- ఆయన జన్మతో ఒక నక్షత్రము సంబంధము కలిగియున్నది (సంఖ్యాకాండము 24:17; మత్తయి 2:2).
- జనము (ఆదికాండము 12:1-3), గోత్రము (ఆదికాండము 49:10), మరియు ఆయన ఏ కుటుంబములో (యెషయా 11:1; యిర్మీయా 23:5) జన్మించునో, ఇవన్నీ ముందుగానే తెలియజెప్పబడినవి (మత్తయి 1:1-6).

ఈ ప్రవచనములన్నియు సరిగ్గా అవి పలుకబడిన విధంగానే నెరవేరినవి. ఇంకా, ఆయన పుట్టుకను గూర్చి మాత్రమే గాక, మెస్సీయ జీవితంలోని సంఘటనలు సహితము ప్రవచింపబడినవి:

- ఆయన "ఐగుప్తులో నుండి" పిలువబడును (హోషేయ 11:1; మత్తయి 2:15).
- ఆయన గొప్ప కార్యములు చేయును (యెషయా 35:5, 6; మత్తయి 11:2–5).
- ఆయన తృణీకరింపబడును (యెషయా 53:3; యోహాను 1:11).

యేసు మరణమును గూర్చిన సంఘటనలు కూడ ప్రవచించబడినవి:

- యేసును అప్పగిస్తే చెల్లించబడు వెల ఎంత, మరియు ఆ వెలతో ఏమి చేయబడునో యని నిర్దిష్టముగ తెలియజెప్పబడినది (జెకర్యా 11:12, 13; మత్తయి 27:3–10).
- ఆయనకు తీర్పు తీర్చబడునప్పుడు ఆయన ఎలా ప్రవర్తిస్తాడు, మరియు సిలువ శ్రమానుభవమేమైయుండును మొదలగునవి వర్ణింపబడియున్నవి (యెషయా 53:7–9; మత్తయి 27:12–14; అపొస్తలుల కార్యములు 8:32–35).
- ఆయన మరణించు తీరు ముందుగానే తెలియజెప్పబడినది (కీర్తనలు 22:16–18; మత్తయి 27:35).
- ఆయన ఎముకలలో ఒకటైనను విరువబడదు (కీర్తనలు 34:20; యోహాను 19:32, 33). ఆయన నిర్దిష్టముగా పేర్కొనబడిన ఒక సమాధిలో పాతిపెట్టబడును (యెషయా 53:9; మత్తయి 27:60).

చివరకు, ఆయన పునఃరుత్థానము (కీర్తనలు 16:10; అపొస్తలుల కార్యములు 2:31) ఆయన ఆరోహణము (కీర్తనలు 68:18; అపొస్తలుల కార్యములు 1:9, 10; ఎఫెసీయులకు 4:8) కూడ ప్రవచింపబడుటయేగాక నెరవేరినవి కూడ.

3. *ఇతరుల సాక్ష్యము.* సెల్సస్ ఆదికాలములో క్రైస్తవ్యమును వ్యతిరేకించినవాడు (క్రీ.శ. 2 శతాబ్దము), అద్భుతకార్యములను చేయు శక్తి ఆయనకు ఎక్కడనుండి వచ్చిందోనని ప్రశ్నించినప్పటికిని, క్రీస్తు అద్భుతకార్యములు చేసాడని అతడు సంపూర్ణముగా అంగీకరించాడు.[30] జాన్ మార్టియర్ (క్రీ.శ. సుమారుగా 100–165), యేసు సకల విధములైన రోగములను మరియు వ్యాధులను స్వస్థపర్చునని యెషయా ప్రవక్త పలికిన ప్రవచనములను యేసుక్రీస్తు నెరవేర్చుట గూర్చి చెప్పాడు. "[ఆయన ఈ కార్యములు చేసెనని] నీవు పొంతి పిలాతు కార్యముల ద్వారా తెలిసికొనవచ్చునని" అని ఈయన వ్రాసాడు.[31] జోసీఫస్, ఒక యూదా చరిత్రకారుడు, ఇలా వ్రాసాడు,

> సుమారుగా ఇప్పుడు, ఇదే సమయంలో యేసు, జ్ఞానముగల మానవుడు, ఆయనను మానవుడు అని పిలుచుట న్యాయసమ్మతమైనట్లయితే, ఏలయనగా ఆయన అద్భుతకార్యములు చేయుచున్నవాడై యుండెను–సంతోషముతో సత్యమును అంగీకరించువారికి ఒక గొప్ప బోధకుడై యుండెను. ఆయన యూదులలో నుండియు, అన్యజనులలోనుండియు అనేకులను ఆయనయొద్దకు ఆకర్షించుకొన్నాడు. ఆయన క్రీస్తై యుండెను; గనుక పిలాతు, మాలో ప్రధానులై యుండినవారి సలహా మేరకు, ఆయనను సిలువవేయబడుటకు అప్పగించినవాడు, ఆయనను తొల్దొలుత ప్రేమించినవారు ఆయనను అనవరతము వెంబడించుట మానలేదు, ఏలయనగా దైవికమైన ప్రవక్తలు ఈ విషయములను మరియు ఆయనను గూర్చిన పదివేల ఇతర ఆశ్చర్యజనకమైన అంశములను ప్రవచించిన విధంగానే, ఆయన వారికి మూడవ దినమున మరలా అగుపించాడు; గనుక క్రైస్తవులైనవారి జాతి, ఆయన మూలముననే

వారికీపేరు వచ్చినది; నేడు సమూలముగా నిర్మూలముకాకున్నారు.[32]

క్రీస్తు, తన జీవితకాలములో "మేలు చేయుచు సంచరించుచుండెనని" అని జోసీఫస్ నివేదిక నిర్ధారించుచున్నది (అపొస్తలుల కార్యములు 10:38).

## నజరేయుడైన యేసు ఎవరు? (16:13–20)

ఆయన గుర్తింపు గూర్చి మనము కలిగియున్న విశ్వాసము విషయము వేయబడుచున్న ప్రశ్నకు గల సమాధానము నేటికిని అత్యంత ప్రాముఖ్యమైన చర్చనీయాంశమైన విషయమై యున్నది. మనము యేసుక్రీస్తు నందు విశ్వాసముంచుచున్నాము, కానీ ఎటువంటి యేసులో మనము నమ్మకముంచుచున్నాము? ఈ గలిలయ మనుష్యుడెవరు?

నిదర్శనమే యేసు సాధికారముతో తెలియజెప్పుచుండిన సత్యములను రుజువు చేయుచున్నది. అయన దైవికమైనవాడై యుండెనని సాధికారముతో సెలవిచ్చాడు (లూకా 22:69, 70; 14:7–11). ఆయన రుజువు, నెరవేరిన ప్రవచనములో, ఆయన చేసిన అద్భుత కార్యములలో (మత్తయి 11:2–5; లూకా 4:16–21), మరియు బాప్తిస్మమిచ్చు యోహాను (యోహాను 1:29–36) మరియు దేవుడు తానే ఇచ్చిన (మత్తయి 3:16, 17; 17:5) సాక్ష్యములలో సహా ఉండినది.

యేసు, దేవుని కుమారుడై యుండనట్లయితే, దాని పరిణామములేమైయుండెను? మన ప్రబోధములు వ్యర్థమగును. ఆయన పునరుత్థానుడైన తరువాత ఆయన చూసారని చెప్పిన అపొస్తలులందరు మరియు ఆది క్రైస్తవులందరు అబద్ధ సాక్షులైయుందురు. క్రీస్తునందు మృతిచెందిన మన ప్రియులైనవారు ఎన్నటికిని మరలా సజీవులు కారు, మరియు క్రైస్తవులు ఈ లోకములో అత్యంత దౌర్భాగ్యులైన ప్రజలై యుందురు. ఇందుకు తారతమ్యముగా, యేసు ఈ లోకములో జీవించాడు, ఆయన మరణించాడు, ఆయన మృతులలో నుండి మరలా లేపబడినాడు, గనుక ఆయన నేడు సహితము సజీవుడై యున్నాడని పౌలు రూఢిగా తెలియజెప్పుచున్నాడు (1 కొరింథీయులకు 15:13–19).

## పేతురు ఒప్పుకోలు (16:16)

యేసు, దేవుని కుమారుడై యుండెనని ఒప్పుకొనినవారిలో పేతురు మొట్టమొదటివాడు కాదు, కానీ అతడు చేసిన ఒప్పుకోలును ఇంత సంపూర్ణముగా చేసిన మొదటివాడు అతడే (మత్తయి 16:16). "నేనే ఆయనను" అని యేసు ఘోషించిన ప్రకటనను మనము నమ్మవలెను (యోహాను 8:23–30). ఆయన దేవుని కుమారుడైయున్నాడని మనము నమ్ముచు, ఇదే సత్యమును యితరుల యెదుట కూడ ఒప్పుకొనవలసియున్నది (మత్తయి 1:32, 33).

## క్రీస్తు సంఘము (మత్తయి 16:18)

"నా సంఘమును కట్టుదును" అని యేసు పలికాడు (మత్తయి 16:18). "నా" అను ఒక్క అక్షరము సొంతదారుని సూచించుచున్న సంబంధార్థకమైన సర్వనామమైయున్నది. సంఘము క్రీస్తుసొంతము ఏలయనగా ఆయన సంఘమును తన స్వరక్తమిచ్చి సంపాదించుకొన్నాడు

(అపొస్తలుల కార్యములు 20:28; 1 పేతురు 1:18, 19; 1 కొరింథీయులకు 6:20 చూడు). సంఘము, ఆయన శరీరము (ఎఫెసీయులకు 1:22, 23; కొలొస్సయులకు 1:18), ఆయన పెండ్లి కుమార్తెయై (ప్రకటన 21:1, 2; రోమీయులకు 7:1-4; ఎఫెసీయులకు 5:22, 23 చూడు), ఆయన మంద (యోహాను 10:14-16; 1 పేతురు 5:1-4), మరియు దేవుని కుటుంబమై యున్నది (1 తిమోతి 3:15). లేఖనములలోసంఘము అనేక విభిన్నమైన వర్ణనాత్మకమైన పదజాలములతో లేదా బిరుదులతో ప్రస్తావించబడియుండగా, సంఘము క్రీస్తుకు చెందినదై యున్నదని కూడ స్పష్టముగా బోధింపబడియున్నది.

ఇది ఇలా సత్యమైయుండగా, "క్రీస్తు సంఘములు" క్రీస్తు శరీరమై యున్నవని ప్రస్తావించబడినప్పుడు ఎవరైనాగాని ఎందుకు ఆక్షేపించాలి? ఇది సంఘమునకు బైబిలు సంబంధమైన బిరుదైయున్నది (రోమీయులకు 16:16). సంఘము తెలియబడుటకు అదొక్కటే పదమై యున్నదని మనము పట్టుబట్టనప్పుడు, సంఘము క్రీస్తుకు, దాని కొరకు మరణించినవానికి, చెందియున్నదని ఉత్తమోత్తమంగా గుర్తించుటకు అది లేఖనములలో ప్రయోగింపబడిన పదజాలమై యున్నది (ఎఫెసీయులకు 5:25).

---

సూచనలు

[1]Josephus *Wars* 3.10.7. [2]బెయేర్షెబా యూదా దేశములో, ఇశ్రాయేలు దేశము దక్షిణ భాగములో ఉండినవి. [3]న్యాయాధిపతులు 20:1; 1 సమూయేలు 3:20; 2 సమూయేలు 3:10; 17:11; 24:2, 15; 1 రాజులు 4:25; 1 దినవృత్తాంతములు 21:2; 2 దినవృత్తాంతములు 30:5 చూడు. [4]Josephus *Antiquities* 18.2.1; *Wars* 2.9.1. [5]Josephus *Wars* 3.9.7; 7.2.1. [6]Josephus *Antiquities* 15.10.3. [7]Josephus *Life* 13. [8]David Hill, *The Gospel of Matthew,* The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 259-60. *The Assumption of Moses* and *The Ascension of Isaiah*లో మోషే మరియు యెషయా గూర్చిన ఇటువంటి సాంప్రదాయములను యూదులు వ్యక్తము చేసారని ఇలా రచించాడు. [9]*Esdras* 2.18. [10]సమదృక్పథ సమానాంతరములలో, "క్రీస్తు" అని మార్కు సామాన్యముగా చెప్పుచున్నాడు (మార్కు 8:29), అయితే లూకా "దేవుని క్రీస్తు" అని చెప్పుచున్నాడు (లూకా 9:20).

[11]"చూడు, ప్రభువా, వారినిమిత్తము వారి రాజును, దావీదు కుమారుని లేవదీయుము, ఆయన నీవెరిగిన సమయంలో, ఓ దేవా, నీ సేవకుడై ఇశ్రాయేలును పరిపాలించును. దుర్నీతిపరులైన పరిపాలకులను నాశనము చేయునట్లు, దానిని నాశనముచేయుటకు దానిని త్రొక్కుచున్న అన్యజనుల నుండి యెరూషలేమును పవిత్రపర్చునట్లు బలముగా ఆయనను బలపర్చుమని" అప్రమాణిక గ్రంథంలోని యూదులకు సంబంధించిన ఒక గ్రంథ పాఠము ప్రకటించుచున్నది. (*Psalms of Solomon* 17.21.22.) [12]John Lightfoot, *A Commentary on the New Testament from the Talmud and Hebraica: Matthew-1 Corinthians*, vol. 2, *Matthew-Mark* (Oxford University Press, 1859; reprint, Grand Rapids, Mich.: Baker, 1979), 234. Talmud *Berakoth* 28b. [13]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick W. Danker (Chicago: University of Chicago Press, 2000), 809. [14]Ibid. [15]Michael J. Wilkins, "Matthew," in *Zondervan Illustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Matthew, Mark, Luke,* ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 102. [16]Hill, 262. [17]Donald A. Hagner, *Matthew 14-28*, Word Biblical Commentary, vol. 33B (Dallas: Word Books, 1995), 470. [18]ఏదిఏమైనా, ఎఫెసీయులకు 2:20లో గల "పూనాది" అపొస్తలుల బోధను సూచించుచున్నదని ఎంచుదురు. [19]J. W. McGarvey, *The New Testament Commentary*, vol. 1, *Matthew and Mark* (N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 145. [20]సంఘమును సూచించుటకు క్రొత్త నిబంధనలో "సమావేశము" మరియు "సభ" అను పదము ప్రయోగింపబడియుండగా, ఇది యితర ప్రజా గుంపును కూడ సూచించవచ్చును. సెప్టుజంటలో, *ekklēsia (*ఎక్లిషియా) అను పదము తరచుగా ఇశ్రాయేలీయుల 'సమావేశమును" సూచించుచున్నది (అపొస్తలుల

కార్యములు 7:38 చూడు). గ్రీకులో ఎక్లీషియా అను పదమును స్వేచ్ఛా పౌరుల "సభను" సూచించుటకు వాడారు (అపొస్తలుల కార్యములు 19:32, 39, 41 చూడు).

[21]Robert H. Gundry, *Matthew: A Commentary on His Literary and Theological Art* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 331. [22]Jack P. Lewis, " 'The Gates of Hell Shall Not Prevail Against It' (Matt 16:18): A Study of the History of Interpretation," *Journal of the Evangelical Theological Society* 38 (September 1995): 353. [23]Homer *Odyssey* 14.156; *Iliad* 5.646; Aeschylus *Agamemnon* 1291; Hesiod *Theogony* 668, 774; Euripides *Hippolytus* 56-57, 1447; *Hecuba* 1-2; Diogenes Laertius 10.126. [24]Wisdom of Solomon 16:13 (NRSV); 3 Maccabees 5.51 చూడు. [25]పాలస్తీనా దేశంలోని ప్రాచీన ద్వారముల ఫొటోగ్రాఫుల కొరకు, Wilkins 103 చూడు. [26]Arthur Skevington Wood, "Key," in *The International Standard Bible Encyclopedia,* rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1986), 3:10. [27]Talmud *Shabbath* 31ab. [28]Lightfoot, 236-41. [29]ఈ వర్ణనలు Ray Waddle, "Year of Jesus ... but which one and what beliefs?" *The Nashville Tennessean* (11 December 2004): B3. [30]Origen *Against Celsus* 1.6. సెల్లస్ రచించిన *True Word* కు సమాధానమిచ్చుచు ఓరిగెన్ దీనిని రచించాడు, ఇది ఓరిగన్ ప్రస్తావనలలో మాత్రమే మిగిలయున్నది.

[31]Justin Martyr *Apology* 1.48. [32]Josephus *Antiquities* 18.3.3. జోసీఫస్ రచలలో నుండి తీసికొనబడిన ఈ ఉల్లేఖనము క్రైస్తవుల చేత సంకలనము చేయబడినదని అనేక మంది పండితులు నమ్ముదురు, అదే సమయములో దానిలో యూదా చరిత్రకారుని చేత వ్రాయబడిన ప్రాథమికమైన సత్యములున్నవని వారు సామన్యముగా సమ్మతించుదురు. (Lee Strobel, *The Case for Christ* [Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1998], 78-80లో చర్చను చూడు.)